

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 07-12-2024 | సంపుటి - 21 | సంచిక -229 | రూ : 4 | పేజీలు: 8

# బీఆర్ఎస్ నేతల గృహ నిర్బంధం

- ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నాం: హరీశ్‌రావు
- 8న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ



హైదరాబాద్/నార్సింగ్, డిసెంబరు 6 : తమ పార్టీ నేతల అరెస్టులను నిరసిస్తూ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం ఉదయమే బీఆర్ఎస్ నేతల ఇళ్ల వద్దకు చేరుకుని వారిని హౌస్ అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత ఇళ్ల వద్ద మోహరించి వారిని నిర్బంధంలో ఉంచారు. మాజీ మంత్రి తలసాని, పద్మారావుగౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు కృష్ణారావు, కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సంజయ్, పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులను హౌస్ అరెస్టు చేశారు. దీనిపై హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నామన్నారు. కాగా, ఈనెల 9 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభకు హాజరవుతారా? లేదా తరువాయి 2లో




## మళ్లీ రైతాంగం భగ్గు

- శంభు నుంచి ఢిల్లీకి 101 మంది రైతుల పాదయాత్ర.
- బారికేడ్లు పెట్టి ఆపేసిన పోలీసులు
- వాటిని తొలగించి ముందుకు సాగేందుకు అన్నదాతల యత్నం.. అడ్డుకున్న పోలీసులు..
- బాష్పవాయువు ప్రయోగం.. ఆరుగురు రైతులకు గాయాలు

## రేవతి కుటుంబానికి రూ.25 లక్షలు

2లో



# మహోన్నత దార్శనికుడు అంబేడ్కర్



- అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలు అసాధారణం
- బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ : మాజీ సీఎం కేసీఆర్

హైదరాబాద్, డిసెంబరు 6 : భారతదేశ పాలనకు తన రాజ్యాంగం ద్వారా బాబాసాహెబ్ అంబేడ్కర్ బాటలు వేశారని బీఆర్ఎస్ అధినేత, మాజీసీఎం కేసీఆర్ అన్నారు. వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన ఆయన కీర్తి అజరామరమని పేర్కొన్నారు. శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన వాటా, సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని రూపొందించడంలో బాబాసాహెబ్ కనబరిచిన దార్శనికత మహోన్నతమైనదని కొనియాడారు. ఆయన ఘనకీర్తిని చాటేందుకే తెలంగాణ సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టుకున్నామని, 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

# ఆరు కాదు.. 160!

- గ్యారంటీలను మించి ప్రజోపయోగ పనులు.. నిత్యం సీఎం రేవంత్ సమీక్షలు, సమావేశాలు
- సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం
- పదేళ్ల విధ్వంస ఆనవాళ్లను చెరిపివేశాం
- ఏడాదిలోనే మార్పు.. సీఎంవో వెల్లడి

హైదరాబాద్, డిసెంబరు 6 : ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టాక తొలి ఏడాదిలోనే మార్పు మొదలైందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు మాత్రమే కాకుండా 160 అంశాల్లో ప్రజోపయోగ పనులు చేపట్టినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుందని, సుస్థిర ప్రజాస్వామిక పాలనతో దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలిపిందని పేర్కొంది. అధికారం చేపట్టినప్పటి తొలిరోజు నుంచే సీఎం రేవంత్ రెడ్డి అన్ని రంగాల్లో తెలంగాణ సమ్మిళిత అభివృద్ధికి నిరంతరం సమీక్షలు... సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొంది. ప్రజాపాలన విజయోత్సవాల తరువాయి 2లో



## ఫోన్‌ట్యాపింగ్ దర్యాప్తు ఇంకా పూర్తికాలేదు

- పరారీలోనే ప్రధాన నిందితుడు
- ఈ దశలో ప్రణీత్‌రావుకు బెయిల్ ఇవ్వొద్దు
- హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదనలు

హైదరాబాద్, డిసెంబరు 6 : ఫోన్‌ట్యాపింగ్ కేసుపై ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని, ఈ దశలో ఏ2గా ఉన్న దుగ్యాల ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావుకు బెయిల్ ఇవ్వరాదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును కోరింది.

తరువాయి 2లో





## డిసెంబర్ చివరి నాటికి టూరిజం పాలసీ సిద్ధం చేయండి

- అధికారులకు సీఎం ఆదేశం

హైదరాబాద్: డిసెంబర్ 31 నాటికి రాష్ట్రానికి ప్రత్యేకంగా పర్యాటక విధానాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దానిని తదుపరి శాసనసభ సమావేశాల్లో చర్చకు ఉంచి సమగ్రంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం రాత్రి ఆయన పర్యాటక శాఖపై సమీక్షించారు. తెలంగాణలో వాతావరణపరంగా అనుకూల పరిస్థితి ఉండటం, శాంతిభద్రతలు మెరుగ్గా ఉండటం పర్యాటక రంగ పురోగతికి కలిసొచ్చే అంశాలని, వీటిని వినియోగించుకుంటూ పర్యాటకులు అధికంగా రాష్ట్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తరువాయి 2లో


## గ్రూప్-1 రద్దు కుదరదు..

- పిటిషనర్లు ఎవరూ మెయిన్స్‌కు అర్హతే సాధించలేదు
- 30 వేల మందికి సంబంధించిన అంశమిది: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, హైదరాబాద్, డిసెంబరు 6: గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను రద్దు చేయడం కుదరదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఇది సుమారు 30 వేల మంది అభ్యర్థులకు సంబంధించిన అంశమని స్పష్టం చేసింది. గ్రూప్ 1 రద్దు, మెయిన్స్ వాయిదా తరువాయి 2లో



## అన్నదాతలపై బాష్పవాయువు ప్రయోగం



- గాయపడిన కర్షకులు..ఆసుపత్రికి తరలింపునిలిచిన రైతుల 'చలో ఢిల్లీ'
- సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా
- భేటీలో తేలనున్న తదుపరి కార్యాచరణ
- పంజాబ్-హరియాణా సరిహద్దు ప్రాంతం శంభులో రైతులపైకి బాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసులు

2లో

# ఆరు కాదు..160!

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు గత ఏడాది డిసెంబరు నుంచి ప్రభుత్వం చేపట్టిన 160 ప్రజోపయోగ పనుల్లో ముఖ్యమైన వాటిని సీఎంవో వెల్లడించింది. పదేళ్ల విధ్వంసపు ఆనవాళ్లను చెరిపేసి తెలంగాణ పునర్ వైభవాన్ని కొనసాగిస్తూనే.. సమగ్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించింది. తెలంగాణను ఫ్యూచర్ స్టేట్‌గా, హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా ప్రపంచానికి పరిచయం చేసేందుకు సీఎం రేవంత్ చేసిన ప్రయత్నాలు.. తొలి ఏడాదిలోనే సత్ఫలితాలు ఇచ్చినట్లు వివరించింది. ''తొలి ఏడాదే 55,143 ఉద్యోగాల భర్తీతోలక్షలాది మంది నిరుద్యోగుల ఆకాంక్షలను ప్రజాప్రభుత్వం నెరవేర్చింది. రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తడంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. ఫలితంగా తెలంగాణలో నిరుద్యోగ శాతం తగ్గుముఖం పట్టింది. ఈ ఏడాది వానాకాలం సీజన్ ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలచింది. 67లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే.. 153 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. 25లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు ఏకకాలంలో పంట రుణాలు మాఫీ చేశాం. ఐదేళ్లలో 30లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తెచ్చేలా పనులు ప్రారంభించాం'' అని పేర్కొంది.

*** పేదల సంక్షేమం కోసం**

మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో రోజుకు సగటున 30లక్షల మంది మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా వారికి రూ.1500 కోట్ల ఆదా చేయగలిగామని సీఎంవో వెల్లడించింది. మహిళలకు వడ్డీలేని రుణాల పునరుద్ధరణ. రుణ బీమాతోపాటు సంఘం సభ్యురాలికి రూ.10లక్షల ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకంతో 40లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని పేర్కొంది. ''గృహజ్యోతి పథకం కింద అరకోటి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నట్లు తెలిపింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి ఏడాదిలోనే 4.50లక్షల ఇళ్ల మంజూరు, లబ్ధిదారుల ఎంపిక కోసం మొబైల్ యాప్‌ను ప్రారంభించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచిత వైద్యం పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాం. కొత్త ఆర్వోఆర్ ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణను ఇప్పటికే పూర్తి చేశాం. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించి... కొత్త చట్టం తీసుకొస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణకు జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేశాం. మహిళాశక్తి సంఘాల ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందించాం. గతంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లలో అవకతవకలపై విచారణకు జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేశాం. ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించడంతోపాటు ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు ఈహెచ్‌ఎస్ పథకంలో మార్పులు చేశాం. ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడంతోపాటు 557కారుణ్య నియామకాలు చేపట్టాం'' అని వెల్లడించింది.

*** విద్య, వైద్య రంగాల్లో..**

రాష్ట్రంలో కొత్తగా 8 ప్రభుత్వ వైద్య కళాశాలలు, 17నర్సింగ్, 28 పారా మెడికల్ కళాశాలల ఏర్పాటు చేసినట్లు సీఎంవో తెలిపింది. ''రూ.2వేల కోట్లతో గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనానికి శంకుస్థాపన చేశాం. ఆరోగ్య శాఖలో 7 వేలకు పైగా పోస్టులను ఇప్పటికే భర్తీ చేయగా.. కొత్తగా 9300 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.667.25కోట్లు కేటాయించగా, అమ్మ ఆదర్శ కమిటీల సారథ్యంలో పనులు కొనసాగుతున్నాయి. హాస్టళ్లలోని 7.65 లక్షల మంది విద్యార్థులకు డైట్ చార్జీలను 40 శాతం పెంచాం. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటుపై దృష్టి పెట్టాం'' అని వివరించింది.

*** వివిధ రంగాల్లో అభివృద్ధి పనులు**

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10కోట్ల దాకా ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించినట్లు సీఎంవో తెలిపింది. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి రూ.3,046 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పింది. ''హైదరాబాద్‌లోని చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రాను ఏర్పాటు చేశాం. గోదావరి జలాలతో మూసీ పునరుజ్జీవం దిశగా అడుగులు వేస్తున్నాం. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. రూ.24,237 కోట్లతో 76.4కిలోమీటర్ల మేర మెట్రో రైలు విస్తరణ చేపట్టాలని నిర్ణయించాం. హైకోర్టు నూతన భవనానికి బుద్వేల్‌లో 100ఎకరాల స్థలం కేటాయించాం. రీజనల్ రింగ్ రోడ్డునుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాం. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. హైదరాబాద్ శివారులోని కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణాన్ని ఇటీవలే ప్రారంభించాం. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సు సందర్భంగా రాష్ట్రంలో రూ.40,232కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు అంగీకరించాయి. తద్వారా 30వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికా, దక్షిణకొరియాలో పర్యటించగా.. దాదాపు రూ.31502 కోట్ల మేర పెట్టుబడులు పెడతామంటూ పలు సంస్థలు ఎంవోయూ కుదుర్చుకున్నాయి'' అని సీఎంవో పేర్కొంది. రాష్ట్రంలో బీసీల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని ముదిరాజ్, యాదవ కుర్మ, మున్నూరు కాపు, పద్మశాలి, పెరిక, లింగాయత్, మేరా, గంగపుత్ర కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లు వివరించింది.

# డిసెంబర్ చివరి నాటికి టూరిజం పాలసీ సిద్ధం చేయండి

(మొదటిపేజీ తరువాయి)

పర్యాటకశాఖ స్వయంసమృద్ధి సాధించేలా చూడాలని, ఇందుకోసం కాన్సెప్ట్ టూరిజంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. దుబాయ్, సింగపూర్, చైనాల్లో పర్యాటకరంగం వృద్ధి చెందేందుకు అనుసరించిన పద్ధతులను అధ్యయనం చేసి స్థానికంగా అనువైన అంశాలను అనుసరించాలని చెప్పారు. తమిళనాడు తరహాలో ఆటోమొబైల్ రంగం స్థానికంగా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. టైగర్ రిజర్వ్ ఫారెస్టులు పర్యాటకులను బాగా ఆకట్టుకుంటాయని, ఇందుకోసం మధ్యప్రదేశ్, మహారాష్ట్రల నుంచి తెలంగాణకు పులులు వచ్చేలా చూడాలని సూచించారు. పులులు తిరిగే ప్రాంతాలకు చేరువగా ఉన్న దేవాలయాలను అనుసంధానిస్తూ ఎకో టూరిజంటెంపుల్ టూరిజంను అభివృద్ధి చేయాలని సూచించారు

మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల దేవాలయాలకు వెళ్లే వారి సంఖ్య పెరిగిందని, ఇది కూడా పర్యాటకాభివృద్ధికి దోహదమయ్యే అంశమేనన్నారు. ఫ్యూచర్ సిటీలో మెగా కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని, అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 20 నిమిషాల్లో దానికి చేరుకునేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు అనువైన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. పర్యాటకాభివృద్ధి సంస్థ నుంచి లీజుకు తీసుకున్న స్థలాలను గడువు ముగిసినా ఖాళీ చేయని సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆయా స్థలాలపై ఉన్న కోర్టు స్టేలను ఎత్తివేసేలా అడ్వొకేట్ జనరల్‌తో చర్చించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని ఖాళీ చేసిన తర్వాత ఆ భవనాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు. చార్మినార్ ను మరింత మంది సందర్శించాలంటే ఏం చేయాలో తేల్చి ఆమేరకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఆ శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, ఎండీ ప్రకాశ్‌రెడ్డి, సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

# రేవతి కుటుంబానికి రూ.25 లక్షలు

- **దాంతోపాటు.. వైద్య ఖర్చులు కూడా భరిస్తా**
- **ఏం చేసినా.. ఆమె లేని లోటు పూరించలేం: అల్లు అర్జున్**

హైదరాబాద్, డిసెంబరు 6: పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడం నా చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్ స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామంటూ ఒక వీడియో విడుదల చేశారు. 20 ఏళ్లుగా ఆనవాయితీగా థియేటర్‌కు వెళ్లి అభిమానులతో సినిమా చూస్తున్నానని.. ఇన్నేళ్లలో ఎప్పుడూ ఏమీ జరగలేదని.. అనూహ్యంగా ఇప్పుడు జరిగిన ఘటన తమను కలచివేసిందని అందులో పేర్కొన్నారు. రేవతి మరణవార్త తెలియగానే తామంతా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని చెప్పారు. ''రేవతి కుటుంబానికి.. మా ప్రగాఢ సానుభూతి. మేమేం చేసినా.. ఎంత మాట్లాడినా.. ఆ లోటు పూరించలేనిది'' అని ఆవేదన వెలిబుచ్చారు. ''మీకు మేమున్నాం. మావైపు నుంచి మీకు ఏ సాయం కావాలన్నా.. మా శక్తి మేరకు చేస్తాం. నా తరఫు నుంచి రూ.25 లక్షలు వారి భవిష్యత్తు కోసం ఇవ్వాలనుకుంటున్నాను. ఈ డబ్బుతో సంబంధం లేకుండా.. వైద్య ఖర్చులు కూడా భరిస్తా. ఆ కుటుంబం బాధ్యత నాది'' అని భరోసా ఇచ్చారు. ''మేము సినిమా తీసేది ప్రేక్షకులను సంతోషపెట్టాలనే. మీరంతా కుటుంబాలతో కలిసి థియేటర్లకు వచ్చి, చూసి ఆనందించాలనే. కాబట్టి, సినిమా చూడ్డానికి వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండండి. ఎంజాయ్ చేయండి. తిరిగి ఇంటికి క్షేమంగా వెళ్లండి'' అని తన అభిమానులకు, ప్రేక్షకులకు హితవు పలికారు.

# నేటి నుంచి ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు వేడుకలు

- **మూడు రోజుల పాటు నిర్వహణ- పకడ్బందీ ఏర్పాట్లు చేయండి : సీఎస్ శాంతికుమారి**



హైదరాబాద్ : ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా 7,8,9 తేదీల్లో హైదరాబాద్లో జరిగే కార్యక్రమాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్లోని సచివాలయంలో ముగింపు వేడుకల ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముగింపు వేడుకల కార్యక్రమాలను ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ను ఆదేశించారు. ముగింపు వేడుకలను ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యే అవకాశమున్న నేపథ్యంలో పారిశుధ్యం, తాగునీరు, టాయిలెట్, మొదలగు మౌలిక వసతుల ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ట్యాంక్బండ్పై 8న జరిగే ఎయిర్షోకు భారత వైమానిక దళం అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. 9న ట్యాంక్బండ్పై నిర్వహించే డ్రోన్ షోకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రముఖ సంగీత కళాకారులు వందేమాతరం శ్రీనివాస్, థమన్, రాహుల్ సిప్లిగంజి సంగీత కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యే అవకాశమున్న నేపథ్యంలో వేదికల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలనీ, కళాకారుల కోసం ప్రత్యేక గ్రీన్ రూం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమాలను అందరూ వీక్షించేలా రోడ్డుకిరువైపులా ఎల్ఈడీ స్క్రీన్లు సిద్ధం చేయాలన్నారు. 9న జరిగే సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం, బహిరంగసభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బహిరంగ సభలో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రముఖులు హాజరయ్యే అవకాశమున్న నేపథ్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లను చేయాలని హోంశాఖ అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్రాజ్, ప్రభుత్వ సలహాదారులు శ్రీనివాసరాజు, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, జీఏడీ కార్యదర్శి రఘునందన్రావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సెర్ప్ సీఈఓ దివ్య, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీశ్, మెట్రో వాటర్ వర్క్స్ ఎమ్డీ అశోక్రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, వైమానిక దళ అధికారులు పాల్గొన్నారు.

# మళ్లీ రైతాంగం భగ్గు

న్యూఢిల్లీ, డిసెంబరు 6 : కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు కేంద్రం చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌తో రైతన్న మరోసారి గర్జించాడు. పంజాబ్‌హరియాణా సరిహద్దులోని శంభు శిబిరం నుంచి రైతులు శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీ దిశగా పాదయాత్ర (జాతా) ప్రారంభించారు. కొంతదూరం సాగగానే హరియాణా పోలీసులు అడ్డుకున్నారు. అయినా రైతులు అడుగు ముందుకేశారు. దీంతో పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ఎనిమిది మంది రైతులు గాయపడ్డారు. దరిమిలా పాదయాత్రను శుక్రవారం ఒక్కరోజు నిలిపివేస్తున్నట్లు రైతు సంఘాల నేతలు ప్రకటించారు. అంతకుముందు ఉదయం 101 మంది రైతులు తమ సంఘాల జెండాలను చేతబట్టి 'చలో ఢిల్లీ' పాదయాత్ర మొదలుపెట్టారు. అయితే పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి.. బారికేడ్లు, ఇనుప కంచెలు ఏర్పాటు చేశారు. 'సత్నాం వాహెగురూ' అని నినదిస్తూ రైతులు ముందుకు కదిలారు. బారికేడ్లను వారిలో కొందరు తొలగించారు. ఇనుప వలను గగ్గర్ నదిపై నిర్మించిన వంతెనపైకి విసిరేశారు. అయితే తొలి అంచె వరకే వారు ముందుకెళ్లగలిగారు. ఆ తర్వాత వారు అడుగు కూడా వేయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఓ రైతు సాహసంతో పోలీసు బలగాలు ఏర్పాటుచేసుకున్న తాత్కాలిక షెడ్‌పైకి ఎక్కాడు. టియర్ గ్యాస్ గోళాల ప్రయోగంతో పొగ సోకకుండా చాలా మంది రైతులు గోనె సంచులను కళ్లు, నోటికి అడ్డుపెట్టుకుని అటూ ఇటూ పరుగులు తీశారు. పోలీసులు నీటి ఫిరంగి వాహనాలను కూడా మోహరించారు. అంబాలా జిల్లా అంతటా నిషేధాజ్ఞలు విధించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేశారు. యాత్ర సాగే తొమ్మిది గ్రామాల్లో మొబైల్ ఇంటర్నెట్, ఎస్‌ఎంఎస్ సేవలను నిలిపివేశారు. దీంతో శుక్రవారం యాత్రను సస్పెండ్ చేస్తున్నట్లు రైతు సంఘం నేత సర్వన్‌సింగ్ పంధేర్ ప్రకటించారు. గాయపడిన ఆరుగురు రైతులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా సమావేశమై తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తాయన్నారు. ట్రాక్టర్‌ట్రాలీలను తీసుకురాకుండా యాత్ర చేపడితే తమకు అభ్యంతరం లేదని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెందిన బీజేపీ నేతలు ప్రకటించారని.. ఇప్పుడు పాదయాత్రను కూడా అడ్డుకున్నారని ఆక్షేపించారు. ఇంకోవైపు.. ఖనౌరీ వద్ద చేపట్టిన తన ఆమరణ దీక్షను సంయుక్త కిసాన్ మోర్చా నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ శుక్రవారం కూడా కొనసాగించారు.

**రైతుల డిమాండ్లు ఇవీ..**

కనీస మద్దతు ధరకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలని.. రైతు రుణాలను మాఫీ చేయాలని.. రైతులకు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని.. అన్నదాతలపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని.. కరెంటు చార్జీలు పెంచకూడదని.. 2013 భూసేకరణ చట్టాన్ని పునరుద్ధరించాలని.. 202021లో ఉవ్వెత్తున జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించాలని.. యూపీలోని లఖీంపూర్ ఖేరీలో 2021లో చోటుచేసుకున్న హింసాకాండ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి రైతులు శంభు, ఖనౌరీ వద్ద మకాం వేసి ఉద్యమిస్తున్నారు. ఫిబ్రవరి 18న కేంద్రప్రభుత్వ ప్రతినిధులు వారితో చర్చలు జరిపారు. ఆ తర్వాత వారి వద్దకు ఎవరూ రాలేదు. కాగా.. 'చలో ఢిల్లీ' యాత్రకు జైరాం రమేశ్ మద్దతు ప్రకటించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధర ఇవ్వాలన్నారు.

# బీఆర్‌ఎస్ నేతల గృహ నిర్బంధం

(మొదటిపేజీ తరువాయి)

అన్న దానిపై రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో 8న ఎర్రవెల్లిలో కేసీఆర్ సమావేశమవుతున్నారు. సభలో సర్కారును ఇరుకున పెట్టేందుకు ఏం చేయాలన్న దానిపై ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. ఈ భేటీ తర్వాతే కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు వస్తారా? రారా? అనేది వెల్లడయ్యే అవకాశమున్నట్లు సమాచారం.

# ఫోన్‌ట్యాపింగ్ దర్యాప్తు ఇంకా పూర్తికాలేదు

(మొదటిపేజీ తరువాయి)

తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ప్రణీత్‌రావు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై వాదనలు వినిపిస్తూ ఈ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రణీత్‌రావు తరఫున న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదిస్తూ.. దర్యాప్తు పూర్తయిందంటూపోలీసులు దిగువ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారని, ఇప్పుడేమో పూర్తికాలేదని అంటున్నారని తెలిపారు. ఒక్కసారి ఛార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత దర్యాప్తు అధికారి దానికి కట్టుబడి ఉండాలని చెప్పారు. పోలీసులు ఊగిసలాట ధోరణి ప్రదర్శిస్తున్నందున బెయిల్ ఇవ్వాలని కోరారు. హోంశాఖ తరఫు న్యాయవాది మహేశ్‌రాజే వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు, ఆరో నిందితుడు శ్రవణ్‌రావు పరారీలో ఉన్నారని తెలిపారు. వారి పాత్ర ఏంటో ఇంకా దర్యాప్తు జరగాల్సి ఉందని తెలిపారు. పట్టుబడిన నిందితుల పాత్ర వరకు ఛార్జిషీట్ దాఖలు చేశామని పేర్కొన్నారు. అందువల్ల దర్యాప్తు ముగియలేదని, ఈ కారణంగా బెయిల్ ఇవ్వకూడదని తెలిపారు. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈనెల 23కు ధర్మాసనం వాయిదా వేసింది. మరోవైపు ఇదే కేసులో ఏ5గా రాధాకిషన్‌రావు బెయిల్ పిటిషన్‌లో వాదనలు ముగియడంతో జస్టిస్ సుజన ధర్మాసనం తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

# గ్రూప్1 రద్దు కుదరదు..

(మొదటిపేజీ తరువాయి)

కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కొట్టేసింది. సుప్రీం తీర్పుతో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు (టీజీపీఎస్సీ) భారీ ఊరట లభించినట్టయింది. గత ప్రభుత్వం 2022లో గ్రూప్1 నోటిపికేషన్ ఇచ్చినప్పటికీ.. పరీక్ష పేపర్ల లీకేజీతో ఒకసారి, నిర్వహణ లోపంతో మరోసారి పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత నోటిఫికేషన్‌ను పక్కన పెట్టి కొత్త నోటిఫికేషన్ ఇవ్వగా.. అది చట్టవిరుద్ధమని, దాన్ని రద్దు చేయాలని కోరుతూ గంగుల దామోదర్ రెడ్డి అనే వ్యక్తి సహా ఏడుగురు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో వారికి నిరాశ ఎదురైంది. దీంతో హైకోర్టు తీర్పును వారు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాది గురు కృష్ణకుమార్ వాదనలు వినిపించారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను కొత్తప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టిందని తెలిపారు. కొత్త నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించిన ప్రిలిమ్స్‌లో 14 ప్రశ్నలు తప్పుగా ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. పరీక్ష తేదీలోనూ మార్పు చేశారని తెలిపారు. ప్రశ్నల్లో తప్పులపై టీజీపీఎస్సీ నియమించిన నిపుణుల కమిటీ రిపోర్టు సైతం సరిగా లేదని ఆరోపించారు. అందుకే, ప్రిలిమ్స్‌పై స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ రిపోర్టు వచ్చే దాకా మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. హైకోర్టు మెరిట్స్‌లోకి వెళ్లకుండానే తమ పిటిషన్‌ను కొట్టివేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఈ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. ప్రభుత్వం ఇచ్చిన జీవో 29పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోందని గుర్తు చేసింది.

## నేడు ఆటో ల బంద్ ను జయప్రదం చేయండి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు ట్రాన్స్పోర్ట్ బంద్ తలపెట్టడం జరిగిందని, అందులో భాగంగానే ఆటో బంద్ జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు డి వీరన్న, కుమార్ , చంద్ర శేఖర్, మల్లిఖార్జున్ ఆటో కార్మికులకు పిలుపునిచ్చారు. స్థానిక కొత్తగూడెం పట్టణంలో ఆటో అడ్డాల వద్ద ప్రచారం నిర్వహించారు . ఆటోలకు పోస్టర్లు, కరపత్రాలు, కార్మికులకు బ్యాడ్జీలు పెడుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు . ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేసి జాయింట్ యాక్షన్ ఏర్పాటుచేసే ఈ సమ్మె ను కొనసాగిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా కొత్తగూడెం పట్టణంలో రేపు డిసెంబర్ 7న ఆటల బంద్ విజయవంతం చేయాలని ఆటో కార్మికులకు పిలుపునిచ్చారు . ప్రతి కార్మికుడికి జీవనభృతి కింద ప్రతి నెల 15 వేల రూపాయలు ఇవ్వాలని వారు అన్నారు. గృహ లక్ష్మీ పథకం కింద ఇందిరమ్మ ఇల్లు ఐదు లక్షల రూపాయల ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలపై దోపిడినీ అరికట్టాలని అన్నారు. ఆటో రవాణారంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి సంక్షేమాన్ని అందేలా చూడాలన్నారు . తదితర డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ కార్మికుల పోరాటాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ముఖ్య రమేష్ రాంబాబు రామ్ కోటి మజీద్ తదితరులు పాల్గొన్నారు.

## కోటక్ మ్యూచువల్ ఫండ్ మార్కెట్ అవుట్ లుక్ 2025 విడుదల




హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ లిమిటెడ్ మార్కెట్ ఔట్లుక్ 2025 నివేదికను విడుదల చేసింది. కోటక్ మ్యూచువల్ ఫండ్, భారత ఆర్థిక వ్యవస్థ, మూలధన మార్కెట్ల దిశలో స్థూలఆర్థిక దృక్పథాన్ని పంచుకుంటూ, రాబోయే సంవత్సరంలో పెట్టుబడిదారులు చూడగలిగే వివిధ పెట్టుబడి థీమ్లను హైలైట్ చేస్తూ నివేదికను ప్రారంభించింది. కోటక్ మహీంద్రాఏఎంసి మేనేజింగ్ డైరెక్టర్, నీలేష్ షా, మాట్లాడుతూ "మార్కెట్ దిద్దుబాట్ల సమయంలో సరసమైన ధరల వద్ద పెట్టుబడి పెట్టడం సాధ్యమవుతుంది. ఆదాయాలు పిఈ వృద్ధికి తక్కువ అవకాశం ఉన్న మార్కెట్ వృద్ధితో, స్థిరమైన, దీర్ఘకాలిక రాబడిని లక్ష్యంగా చేసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యవధిలో, స్థిర ఆదాయ పెట్టుబడులు ఇప్పుడు తక్కువ రిస్కో పోటీ రాబడిని అందిస్తాయి. పెరిగిన ప్రభుత్వ వ్యయం బలమైన వినియోగ ధోరణులు ఆశావాదానికి ఆజ్యం పోస్తున్నప్పటికీ, ప్రైవేట్ బ్యాంకులు, ఆటో, టెలికాం, ఫార్మా ఐటివంటి రంగాలలో విలువ అవకాశాలు ఉన్నాయి. రాబోయే వివాహ సీజన్ వినియోగం ఆర్థిక వృద్ధిని పెంచుతుందని అంచనా వేయబడిందన్నారు.

## సమాచార హక్కు చట్టం కమీషనర్లను నియమించాలని వినతి



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : సమాచార హక్కు చట్టం కమీషనర్లను నియమించాలని శుక్రవారం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులు హైదరాబాద్ లో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ని మినిస్టర్ క్వార్టర్స్ లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్ 3 ప్రకారం దేశ పౌరులందరూ సమాచారం పొందే హక్కు ఉందన్నారు. అతి తొందరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆర్టిఐ కమిషనర్లను నియమించేందుకు కృషి చేస్తా అన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కోసం వివిధ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోగా, 30రోజుల్లోగా ఇవ్వ వలసిన సమాచారాన్ని కొన్ని నెలలు గడిచినా ఇవ్వడం లేదని ఆయన అన్నారు. సెక్షన్ 19(1) ప్రకారం మొదటి అప్పీల్ సమాచారం ఇవ్వట్లేదనీ, అలాగే సెక్షన్ 19(3) ప్రకారం రెండవ అప్పీల్ చేస్తే స్టేట్ కమిషన్ ఆఫీస్ లో కమిషనర్లు లేక వేల దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీఐ కమిషనర్లను నియమించాలని, సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి వింజమూరి గణేష్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

*** కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదవర్గాల సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు లబ్ధిదారులకు సూచించారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని కొత్తగూడెం మున్సిపాలిటీ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాలకు చెందిన 215మంది లబ్ధిదారులు రూ.2.15కోట్ల విలువచేసే కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను, అదేవిధంగా 110 మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ కుంచి మంజూరైన రూ.40.50లక్షల విలువచేసే చెక్కులను



శుక్రవారం కొత్తగూడెం క్లబ్బులో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అందజేశారు. నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకం ఆడబిడ్డలు ఉన్న పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోందని, ఆడపిల్లలకు వివాహం చేయడం భారంగా మారుతున్న ప్రస్తుత రోజుల్లో ఈ పథకం తల్లిదండ్రులకు ధైర్యాన్ని అందిస్తుందన్నారు. ఎన్నికల వాగ్దానం మేరకు తులం బంగారం పాత, కొత్త లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. అత్యవసర పరిస్థితిలో వైద్యం చేయించుకున్న తర్వాత అందించే సిఎం రిలీఫ్ ఫండ్ పరిమితిని ఎత్తివేసి పూర్తిస్థాయిలో చేసిన ఖర్చును అందించాలని కోరారు. కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ అదేవిధంగా సిఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులో సాంకేతిక సమస్యల వల్ల చాలా జాప్యం జరుగుతోందని దీని అధిగమించే చర్యలకు ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు, ఆస్పత్రి యాజమాన్యాలు పూనుకువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణ, ప్రసాద్, మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్ స్వామి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ కె సాబీర్ పాషా, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, స్థానిక కౌన్సిలర్ ధర్మరాజు, పలువురు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలలో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేత

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గడిచిన అక్టోబర్ 21 పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన పోలీస్ అధికారులు సిబ్బంది , విద్యార్థులకు శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. కేటగిరీల వారీగా నిర్వహించిన ఈ వ్యాస రచన పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని విజేతగా ఎంపిక చేశారు.. ఎస్సై , ఆ పై స్థాయి అధికారులకు ఇచ్చిన అంశం సౌండ్ బాడీలో సౌండ్ డిమ్ లో మొదటి బహుమతి అన్నపురెడ్డిపల్లి ఎస్సై చంద్రశేఖర్, రెండో బహుమతి షీ టీమ్ ఆరెఎస్సై రమాదేవి, మూడో బహుమతిని ఆర్ఎస్ఐ జగన్మోహనాచారీ లు గెలుచుకున్నారు. కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ వరకు ఇచ్చిన అంశం సమాజంలో పోలీస్ ఇమేజ్ ని మెరుగుపరచడంలో నా పాత్ లో డి సి ఆర్ బి లో ఏఎస్ఐ గా పని చేస్తున్న రఘురాములు మొదటి బహుమతిని, కొత్తగూడెం వన్ టౌన్



పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న రామ్ దాస్ రెండో బహుమతిని, టేకులపల్లి పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న ఉపేందర్ రావ్ మూడో బహుమతిని గెలుచుకోవడం జరిగింది. విద్యార్థిని,విద్యార్థులకు ఇచ్చిన అంశం మొబైల్ ఫోన్ల విచక్షణ వినియోగం లో కొత్తగూడెం పట్టణంలోని శ్రీ ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో చదువుతున్న శ్రీ కారుణ్య మొదటి బహుమతిని, పాల్వంచలోని శ్రీ సాయి స్ఫూర్తి డిఏవి స్కూల్లో 8వ తరగతి చదువుతున్న యువతేశ్వరి రెండో బహుమతిని గెలుచుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా రాష్ట్రస్థాయిలో అన్ని జిల్లాల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలలో జిల్లా నుండి విజేతలుగా నిలిచిన వారికి అభినందనలు తెలియజేశారు. శుక్రవారం అందుబాటులో ఉన్న విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగిందని తెలిపారు.

## ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



బొడుప్పల్, (ప్రజాస్ఫూర్తి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్ విగ్రహానికి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆసర్ల మౌనిక బీరప్ప పాల్గొని పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలు,సంక్షేమం కోసం పోరాడిన యోదుడన్నారు.ప్రభుత్వ ఫలాలందరికి చెందాలని,సామాజికంగా,ఆర్థికంగా అందరినీ సమానంగా చూడాలన్నారు.

## పేద, బడుగు బలహీనుల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

*** హెచ్.ఎ.ల్ జనరల్ మేనేజర్ రామ్మోహన్ రావు**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : పేద, బడుగు బలహీనులకు రాజ్యాంగ పరంగా అనేకచట్టాలు తెచ్చి వారి అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్అని హెచ్.ఎ.ల్ జనరల్ మేనేజర్ రామ్మోహన్ రావు అన్నారు. డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ 68వ వర్ధంతి ని బాలానగర్ హెచ్.ఎ.ల్ పరిశ్రమలలో శుక్రవారం హెచ్.ఎ.ల్ ఎస్సీఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు యస్.ల్.ఆర్. డి.సి జనరల్ మేనేజర్ ప్రభుల్ మజూందర్ లు ముఖ్య అతిధిలు గా విచ్చేసి బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ప్రపంచ మేధావి అంబేద్కర్ సేవలు మరువలేనివన్నారు. సామాజిక న్యాయం కోసం జరిగే సమరశీల పోరాటాలపై చెరగని ముద్రవేసిన మహనీయుని



బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలు నేటి యువతకు ఆదర్శమని అన్నారు. నేడు ప్రపంచ దేశాలలో అయన జయంతి వర్ధంతులు ఘనంగా నిర్వహిస్తున్నారు అని వారు దేశానికి చేసిన సేవలను నెమరేసుకున్నారు.ఈ కార్యక్రమం లో చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ మురళీకృష్ణ,సీడీ నగేష్,డీజీమ్ హెచ్.ఆర్ సూర్యకుమార్ రావుట్ , చీఫ్ మేనేజర్ హెచ్.ఆర్ ప్రహ్లాద్, రికగ్నైస్డ్ యూనియన్ అధ్యక్షులు వెంకటాద్రి,గౌరవ అధ్యక్షులు విజయప్రసాద్, ప్రధానకార్యదర్శి శ్రీనివాసబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు,అన్వర్ చందర్రావునాయక్, సిబ్గతుల్లాహ్, వెంకటపతి, షకూర్,కుతాడి కృష్ణా, బాబీ, వెంకటేష్, నాగార్జున, కార్మిక్ సంఘ్ నాయకులు వెంగలరావ్, సుబ్బయ్య, శ్రీధర్, జీవన్, నాగేశ్వర్ రావు, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు పట్టు రమేష్,కిషన్ నాయక్, ప్రధాన కార్యదర్శులు శశి,చూడమన్, మాజీ అధ్యక్షులు వై.భాస్కర్ రావు,ఓబీసీ నాయకులు చలం, జోగారావు, సాయి, ప్రవీణ్, జయంతి, విజయశ్రీ, ధనుజయ్, కోటేశ్వరరావు, క్రాంతి, అనిత, మహేందర్, ఈశ్వర్, కృష్ణబాబు, శ్రీనివాస్, గడ్డం రమేష్, పురుషోత్తం, సుదర్శన్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

## సాయినగర్ లో ఘనంగా 18వ మహా పడిపూజ



మేడిపల్లి , ప్రజాస్ఫూర్తి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలోని సాయినగర్ కాలనీలో 18వ మహ పడిపూజ యాస రవీందర్ రెడ్డి నిర్వహించగా బ్రహ్మ శ్రీ శ్రీ సత్యప్రియ గురు స్వామి ఆద్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ పూజ కార్యక్రమం పీర్జాదిగూడ,బోడుప్పల్ కార్పొరేషన్లకు చెందిన స్వాములు అదిక సంఖ్యలో పాల్గొని గణపతి హోమం,అష్టకలషాభి శేఖాలు నిర్వహించి,అయ్యప్ప నామ స్వరణం చేస్తు కన్నుల పండువగా నిర్వహించారు.

## వెలమ సామాజిక వర్గంపై షాద్ నగర్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు

**..స్పందించిన కవిత**

వెలమ సామాజిక వర్గం పట్ల షాద్ నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. తమ సామాజిక వర్గాన్ని కించపరుస్తూ ఎమ్మెల్యే మాట్లాడారని వెలమ సామాజిక వర్గం ప్రతినిధులు ఇప్పటికే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తాజాగా, ఎమ్మెల్యే వ్యాఖ్యలపై కవిత స్పందిస్తూ... ఇలాంటి వ్యాఖ్యలు ప్రజాప్రతినిధి స్థాయికి తగవన్నారు. ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలను తాను ఖండిస్తున్నానన్నారు. శంకర్ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమా? కాంగ్రెస్ పార్టీ వైఖరే అదా? అనే విషయాలను సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు హౌస్ అరెస్టు

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కు నివాళ్ళు అర్పించే అవకాశం లేకపోవడం దారుణమని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. శుక్రవారం ఉదయం కూకట్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కొత్తపల్లి ముత్తు మాధవరం రంగారావు ఇంటికి వచ్చి హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో ఉంచడం తిరిగి శుక్రవారం ఉదయాన్నే హౌస్ అరెస్టు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



పోలీస్ వ్యవస్థని తన ఇష్టానుసారం వాడుకుంటున్నారని అన్నారు.

# భారత సరిహద్దుల్లో కిల్లర్ డ్రోన్లు

- మోహరించిన బంగ్లాదేశ్ సైన్యం
- నిశితంగా పరిశీలిస్తున్నామన్న భారత్
- కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న బంగ్లాదేశ్
- షేక్ హసీనా పదవీ పోవడంతో రణరంగంగా బంగ్లా
- ఇప్పటికే జైళ్ల నుంచి తప్పించుకున్న 700 మంది టెర్రరిస్టులు

**నేషనల్ బ్యూరో** : బంగ్లాదేశ్ భారత్‌ను కవ్విస్తోంది. తాజాగా టర్కీ దేశం తయారు చేసిన బేరక్తర్ టీబీ2 డ్రోన్‌ను పశ్చిమబెంగాల్ సరిహద్దుల వద్ద మోహరించింది. దీనిపై ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్స్ అందడంతో భారత్ నిఘాను పెంచింది. బేరక్తర్‌ల మోహరింపుపై వచ్చిన నివేదికలను సైన్యం నిశితంగా పరిశీలించినట్లు తెలుస్తోంది. ఈ డ్రోన్లను బంగ్లాదేశ్ 67వ ఆర్మీ యూనిట్ ఇంటెలిజెన్స్, నిఘా, గస్తీ కోసం వినియోగిస్తోంది.

బంగ్లాదేశ్‌లో ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత పశ్చిమబెంగాల్ సరిహద్దుల్లో ఉగ్రవాదుల కదలికలు గణనీయంగా పెరిగాయి. దాదాపు 700 మంది ఉగ్రవాదులు, ఖైదీలు ఇప్పటికే జైళ్ల నుంచి తప్పించుకొని ఆ దేశంలో తిరుగుతున్నారు. తాజాగా సరిహద్దుల వద్ద తీవ్రవాదులు, స్మగ్లింగ్ ముఠాలు బలపడుతున్నట్లు ఇంటెలిజెన్స్ నివేదికలు వస్తున్నాయి. ఈ ఏడాది మొదట్లోనే బంగ్లాదేశ్ ప్రభుత్వం టర్కీ నుంచి బేరక్తర్ డ్రోన్లను కొనుగోలు చేసింది. ఇవి తేలికపాటి దాడులు కూడా చేయగలవు. బంగ్లాదేశ్ 12 ఆర్డర్ చేయగా.. వాటిల్లో 6 ఇప్పటికే ఆ దేశానికి అందాయి. ఈ డ్రోన్ దాదాపు 25,000 అడుగుల ఎత్తు వరకు ఎగిరి లేజర్ గైడెడ్ బాంబులను ప్రయోగించగలవు. ఉక్రెయిన్ యుద్ధంలో కూడా రష్యా ట్యాంకులను ఇవి దెబ్బతీశాయి. ఇప్పటికే టర్కీ నుంచి బంగ్లాదేశ్ సైన్యం వివిధ రకాల అత్యాధునిక ఆయుధాలను కొనుగోలు చేసింది. వీటిల్లో రాకెట్ డిఫెన్స్ సిస్టమ్స్, మైన్ రెసిస్టెంట్ వెహికల్, ఆర్మ్‌డ్



పర్సనల్ క్యారియర్స్ ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం కూలిపోయాక ప్రధాని షేక్ హసీనా భారత్‌కు రావడం, అనంతరం మొదలైన అల్లర్లలో హిందూ మైనార్టీలపై తీవ్రమైన దాడులు జరగడంతో ఇరు దేశాల సంబంధాల్లో ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే.

పరస్పరం పలకరించుకున్న

# ప్రధాని మోడీ, ఖర్గే

- పార్లమెంట్ ఆవరణలో అంబేద్కర్ వర్ధంతి
- మహాపరినిర్వాణ్ దివస్ లో నవ్వులు

**నేషనల్ బ్యూరో**: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పార్లమెంటు ఆవరణలో మహాపరినిర్వాణ్ దివస్ కార్యక్రమంలో శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కాగా అక్కడ ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. ప్రధాని మోడీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పరస్పరం పలకరించుకొని కాసేపు నవ్వుతూ మాట్లాడుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మల్లికార్జున ఖర్గే తదితరులు హాజరై నివాళులర్పించారు. ఖర్గే మోదీ వద్దకు వచ్చి షేక్‌హ్యాండ్ ఇచ్చారు. అనంతరం ఇరువురు నేతలు కాసేపు నవ్వుతూ ముచ్చటించారు. ఎప్పుడూ పరస్పర విమర్శలు చేసుకొనే నేతలు ఒకేచోట నవ్వులు



పూయిస్తూ మాట్లాడుకుంటున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి. మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

'సమానత్వం, మానవ గౌరవం కోసం డా.బీఆర్ అంబేద్కర్ చేసిన అవిశ్రాంత పోరాటం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఈరోజు ఆయన సహకారాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన సంకల్పాన్ని నెరవేర్చేందుకు మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.



# తిరుమలలో భక్తుల రద్దీ

- స్వామి దర్శనానికి సుమారు 18 గంటల సమయం
- భక్తులతో నిండిపోయిన కంపార్టు మెంట్లు

ఏపీ బ్యూరో: తిరుమలలో భక్తులకు స్వామి వారి దర్శనానికి సుమారు 18 గంటల వరకు పడుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టీబీసీ క్యూలైన్ వరకు వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న శ్రీవారికి 21,560 మంది తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 2.97 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. కాగా తిరుపతిలోని తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి అమ్మవారు మహారాణీ అలంకారంలో అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. వాహనసేవల్లో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చైర్మన్ బీర్ నాయుడు ఈవో జె. శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్ పాల్గొన్నారు.



# నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఫేక్ పోస్టులు

- మాజీ మంత్రి అంబటి రాంబాబు ఫైర్
- సీమరాజాపై చర్యలు తీసుకోవాలి
- లేకపోతే కోర్టుకు వెళతాం

**ఏపీ బ్యూరో**: కూటమి ప్రభుత్వ పెద్దలపై మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఫైరయ్యారు. కూటమి నేతల ఆధ్వర్యంలో సోషల్‌మీడియాలో వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ వద్ద అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. 'టీడీపీ సోషల్‌మీడియాపై పోలీసులు చర్యలు తీసుకోవాలి. లేదంటే కోర్టులను ఆశ్రయిస్తాం'అని అంబటి హెచ్చరించారు. సీమ రాజాను వెనక ఉండి నడిపిస్తుంది నారా లోకేశ్ అని మండిపడ్డారు. సీమ రాజా అనే అరాచకవాది యూట్యూబ్ లో చేస్తున్న వీడియోలు అసభ్యకరంగా ఉన్నాయి. జగన్, భారతిపై కూడా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. డీజీపీ ఏకపక్షంగా వ్యవహరించకూడదన్నారు. చట్టప్రకారంగా నిర్ణయం తీసుకోవాలని పోలీసులను కోరుతున్నారు. ముఖ్యంగా కేసు పెట్టకపోతే చట్టపరంగా కోర్టుకు వెళతాం. న్యాయ స్థానాలకు వెళ్లి వారిపైన కూడా యాక్షన్ తీసుకుంటామన్నారు.

# ఏపీ నాలెడ్జ్ హబ్ కాబోతుంది

- సీఎం చంద్రబాబు నాయుడు
- విశాఖ పట్నంలో డీప్ టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ కు హాజరు
- పీపీ 4 విధానంలో డెవలప్ చేస్తాం
- అరకు కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది

**ఏపీ బ్యూరో**: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాలెడ్జ్ హబ్ గా తయారు కాబోతుందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఐటీ, నాలెడ్జ్ ఎకానమీలో యువత సమర్థులుగా మారుతున్నారన్నారు. విదేశాల్లోని మన దేశ ఐటీ నిపుణుల్లో 30 శాతం తెలుగువారేనని తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన డీప్‌టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌కు సీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడైనా సాంకేతికతపైనే చర్చ జరుగుతోంది. దీంతో అనేక నూతన మార్పులు వస్తున్నాయి. భారత్‌లో ఆధార్ సాంకేతికత అనుసంధానంతో అన్ని వివరాలు తెలుస్తున్నాయి.



1995లో తొలిసారి సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీ రంగం అభివృద్ధికి కృషి చేశా అన్నారు. పీపీపీ పద్ధతిలో హైటెక్ సిటీని నిర్మించాం. ఇప్పటి వరకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పనులు జరిగేవి. కొత్తగా పీ4 విధానం తీసుకొస్తున్నాం. ఇక నుంచి ప్రజలు, ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్య విధానంతో ముందుకెళ్లామన్నారు. డీప్ టెక్నాలజీతోనూ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. పర్యాటక రంగంలోనూ కొత్త విధానాలు తీసుకొచ్చేలా ఆలోచనలు చేస్తున్నాం. ప్రస్తుతం డ్రోన్లు కూడా కీలకంగా మారాయి. నదుల అనుసంధానంతో నీటి కొరత ఉండదు. ఆహార ఉత్పత్తులు, సరఫరాలో గ్లోబల్ హబ్‌గా ఏపీ మారబోతోంది. అరకు కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. రాష్ట్రానికి ఉన్న వనరుల్లో అధిక తీరప్రాంతం ఒకటి. పెట్టుబడులతో వస్తున్న వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం అని చంద్రబాబు అన్నారు.



# ఏపీలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు

- పెండింగ్ లో ఉన్న భూసమస్యల పరిష్కారానికి వినతుల వెల్లువ
- బనగాల పల్లె యాగంటి పల్లె రెవెన్యూ మీటింగ్ లో పాల్గొన్న మంత్రి బీసీ జనార్ధన రెడ్డి
- వీఆర్వో 2 వేలు లంచం అడిగాడని మహిళ ఫిర్యాదు
- వెంటనే సస్పెండ్ చేసిన మంత్రి

**ఏపీ బ్యూరో** : ఏపీలో ఈ రోజు రెవెన్యూ గ్రామ సభలు ప్రారంభమయ్యాయి.. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోంది.. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం యాగంటి పల్లెలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఇక, సీఎం సహాయ నిధికి,సంబంధించి స్థానిక వీఆర్వో గంగన్న తనను 2 వేల రూపాయలు లంచం డిమాండ్ చేశాడని, గ్రామ సభలో ఓ మహిళ మంత్రి మహిళ ఫిర్యాదు చేసింది. దీంతో వీఆర్వో గంగన్నను గ్రామసభ వేదికపైకి పిలిపించి సస్పెండ్ చేయాలంటూ జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌ను ఆదేశించారు. రెవెన్యూ శాఖలోని కొందరు ఎమ్మార్వోలు, ఆర్ఐలు వీఆర్వోల కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు రైతులకు సేవ చేసే సంకల్పంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఇక, రైతులు తమ భూములకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి బీసీ స్థానిక రైతులకు సూచించారు. గ్రామసభ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం, రెవెన్యూకు సంబంధించి ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకొని దురాక్రమణ పాల్పడిందని ఆరోపించారు. పేదల భూములను కబ్జాలు చేసిన వారికి శిక్ష తప్పదని ఈ సందర్భంగా హెచ్చరించారు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి..



# వైసీపీ ప్రభుత్వంలో దళితులకు అన్యాయం

- మంత్రి నిమ్మల రామానాయుడు

**తెలంగాణ బ్యూరో**: వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్ దళితుల సంక్షేమ పథకాలను తీసేసి వారికి వెన్నుపోటు పొడిచారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఆయన రక్తదానం చేశారు. అంతకుముందు ఆసుపత్రిని తనిఖీ చేసి రోగుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 18 ఏళ్లుగా అంబేద్కర్ వర్ధంతి రోజు తమ తండ్రి పేరుతో ఉన్న ధర్మారావు ఫౌండేషన్ పేరిట రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాను రక్తదానం చేయడం ఇది 24వ సారి అని తెలిపారు. తెదేపా హయాంలో ఎస్సీ సబ్‌ప్లాన్‌ను సమర్థంగా అమలు చేస్తే.. వైసీపీ పాలనలో ఆ నిధులను సైతం దారి మళ్లించారన్నారు.



# శంభు సరిహద్దుల్లో టెన్షన్

- ఢిల్లీ వెళ్లేందుకు బయలుదేరిన పంజాబ్, హర్యానా రైతుల భారీ ర్యాలీ
- ఇంటర్నెట్ నిలిపివేసిన పోలీసులు
- పంటలకు మద్దతు ధర ఇవ్వాలని నిరసన
- టియర్ గ్యాస్ ప్రయోగించిన పోలీసులు
- ఉద్రిక్తంగా మారిన పరిస్థితులు

**నేషనల్ బ్యూరో** : హర్యానా, పంజాబ్ రైతులు భారీ సంఖ్యలో శంభు బార్డర్‌కు చేరుకుని ఢిల్లీకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఢిల్లీ సరిహద్దుల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా అంబాలా జిల్లాలోని 10 గ్రామాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. బ్యాంకింగ్, మొబైల్ రీఛార్జ్ సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదని పేర్కొన్నారు. హర్యానా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఆ మేరకు టెలికామ్ ప్రొవైడర్లకు కూడా తగిన సూచనలు చేసింది. వ్యవసాయ సంస్కరణల ద్వారా తమకు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ అంబాలా రైతులు ఆందోళన చేస్తున్నారు. ఆందోళనలో భాగంగా వారు చలో ఢిల్లీకి పిలుపునిచ్చారు. అయితే రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా పోలీసులు పెద్ద ఎత్తున భారీకేడ్లను ఏర్పాటు చేశారు.దీంతో పోలీసులు, రైతుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. బారికేడ్లను దాటుకొని రైతులు దిల్లీ వైపు కదిలేందుకు యత్నించారు. ఈ క్రమంలో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు.

**మద్దతు ధరపై కేంద్రమంత్రి పార్లమెంట్ లో ప్రకటన**

మరోవైపు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కనీస మద్దతు ధరపై పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేశారు. వ్యవసాయ ఉత్పత్తులను కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మోదీ గ్యారంటీని కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. ఉత్పత్తి ధరకంటే కనీసం 50శాతం అధికంగా చెల్లించి పంటను కొనుగోలు చేయాలన్న ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను పరిగణనలోకి తీసుకోలేమని గతంలో కాంగ్రెస్ చెప్పిందని చౌహాన్ సభకు వివరించారు. కానీ, మోదీ ప్రభుత్వం ఇప్పటికే ధాన్యం, గోధుమలు, సోయాబీన్, జొన్న పంటలకు ఉత్పత్తి ధరకంటే 50 శాతం అధికంగా చెల్లించి కొనుగోలు చేస్తోందని వివరించారు.

# రాజ్యసభలో కరెన్సీ నోట్ల కట్టల కలకలం

- కాంగ్రెస్ ఎంపీ సీటు వద్ద దొరికినట్లు రాజ్యసభ చైర్మన్ వెల్లడి
- అభ్యంతరం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే
- పేరు చెబితే తప్పేంటి అన్న పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు
- దీనిపై సీరియస్ గా దర్యాప్తు జరగాలి
- రాజ్యసభ సమగ్రతకు అవమానం కలిగించారు: జేపీ నడ్డా
- నా దగ్గర కేవలం రూ. 500లు మాత్రమే ఉన్నాయి : ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ

**నేషనల్ బ్యూరో** :

రాజ్యసభలో కరెన్సీ నోట్ల కట్టలు బయట పడటం సంచలనం సృష్టించింది. కాంగ్రెస్‌కు చెందిన ఓ ఎంపీ సీటు వద్ద దీన్ని గుర్తించినట్లు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ శుక్రవారం సభలో ప్రకటించడం తీవ్ర దుమారానికి దారి తీసింది. దీంతో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనిపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యసభ శుక్రవారం సమావేశం కాగా.. ఈ సందర్భంగా చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. గురువారం సభను వాయిదా వేసిన తర్వాత భద్రతా అధికారులు ఛాంబర్‌లో సాధారణ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే 222వ నెంబర్ సీటు వద్ద ఓ నోట్ల కట్టను గుర్తించారు. అది తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ కి కేటాయించిన సీటు అని చెప్పారు. ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకురాగానే దర్యాప్తునకు రూ.500, రూ.100 కరెన్సీ నోట్లు ఉన్న కట్టను గుర్తించినట్లు ధన్‌ఖడ్ తెలిపారు. ఆ నోట్లు అసలైనవో.. నకిలీవో స్పష్టత లేదన్నారు. ఈ విషయాన్ని సభకు చెప్పడం తన బాధ్యత అన్నారు. దీంతో ఇది కాస్తా వివాదానికి దారితీసింది. చైర్మన్ ప్రకటనను సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఖండించారు. ఈ ఘటనపై విచారణకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పిన ఆయన.. దర్యాప్తు పూర్తికాకముందే సభ్యుడి పేరు చెప్పడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు.





ఖర్గే వ్యాఖ్యలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తప్పుబట్టారు. 'పేరు చెబితే తప్పేంటీ? ఏ సీటు వద్ద నగదు దొరికిందో.. అక్కడ ఎవరు కూర్చుంటారో చైర్మన్ చెప్పారు. అందులో సమస్య ఏముంది? ఇలా నోట్ల కట్టలను సభకు తీసుకురావడం సరికాదు. దీనిపై సీరియస్‌గా దర్యాప్తు జరగాలి" అని అన్నారు. రాజ్యసభ సమగ్రతకు అవమానం కలిగించారని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కాంగ్రెస్‌పై మండిపడ్డారు. మరోవైపు, ఈ పరిణామాలపై కాంగ్రెస్ ఎంపీ సింఘ్వీ స్పందించారు. తాను కేవలం ఒకేఒక్క రూ.500 నోటు తీసుకొచ్చానని తెలిపారు. ఇలాంటి పరిస్థితిని నేనెన్నడూ చూడలేదు. నిన్న రాజ్యసభకు వచ్చేటప్పుడు నా జేబులో కేవలం ఒక రూ.500 నోటు మాత్రమే ఉంది. నిన్న మధ్యాహ్నం 12.57 గంటలకు సభ లోపలికి వచ్చా. ఒంటి గంటకు సభ వాయిదా పడటంతో క్యాంటీన్‌కు వెళ్లా. మధ్యాహ్నం 1.30 గంటలకు పార్లమెంట్ నుంచి వెళ్లిపోయా అని సింఘ్వీ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.

# ముంబయిలో థియేటర్‌లో పెప్పర్ స్ప్రే

- పుష్ప 2 మూవీ చూస్తుండగా ఘటన
- థియేటర్ నుంచి బయటకు పరుగులు తీసిన జనం
- అరగంట పాటు సినిమా నిలిపివేత
- కేసు నమోదు చేసుకున్న పోలీసులు



**నేషనల్ బ్యూరో** : ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ది రూల్ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతుండగా అక్కడక్కడ కొన్ని వివాదాలు తలెత్తుతున్నాయి. సినిమా ప్రదర్శితమవుతున్న ముంబై బాంద్రాలోని గెలాక్సీ థియేటర్‌లో పెప్పర్ స్ప్రే కలకలం రేపింది. సినిమా సెకండ్ ఆఫ్‌కి ముందు.. గుర్తు తెలియని వ్యక్తి థియేటర్లో పెప్పర్ స్ప్రే చేశాడు. దీంతో అక్కడ ఉన్న ప్రేక్షకులు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతూ.. కొంతమంది దగ్గుతూ భయంతో థియేటర్ బయటికి పరుగులు తీశారు. దీంతో థియేటర్ యాజమాన్యం పెప్పర్ స్ప్రే ఘాటును తొలగించే ప్రయత్నం చేయడంతో పాటు 30 నిమిషాల వరకు సినిమా ప్రదర్శనను నిలిపివేసింది. అనంతరం మళ్లీ ప్రదర్శించింది. ఈ ఘటనపై థియేటర్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనుమానం ఉన్నవారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

# థాయిలాండ్ ట్రిప్ కు సూపర్ ప్యాకేజీ


ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు మెదలయ్యాయి. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (IRCTC) అద్భుతమైన టూర్ ప్యాకేజీని ప్రకటించింది. అత్యంత తక్కువ ఖర్చుతో ఫారిన్ టూర్ కి ఛాన్స్ కల్పిస్తోంది. ఐఆర్ సీటీసీఏ దేశానికి టూర్ ప్యాకేజీ ప్రకటించింది, ధర ఎంత, ఏమేం చూడవచ్చు వంటి విషయాలన ఇప్పుడు చూద్దాం. క్రిస్మస్ స్పెషల్ థాయ్‌లాండ్ విత్ ఫోర్ స్టార్ అకామడషన్ ఓ ప్రత్యేక టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్యాకేజీలో భాగంగా 6 పగళ్లు, 5 రాత్రులు థాయిలాండ్ అందాలను చూడవచ్చు.

రాజధాని బ్యాంకాక్‌తో పాటు పర్యాటక ప్రదేశం పట్టాయా అందాలను చూడవచ్చు. బ్యాంకాక్‌లోని అడ్వెంచర్ సఫారీ వరల్డ్, మెరైన్ పార్క్‌లను సందర్శించవచ్చు. పట్టాయలోని కోరల్ ద్వీపాన్ని,ఫ్లోటింగ్ మార్కెట్‌ను సందర్శించే అవకాశం లభిస్తుంది. ఈ టూర్ ప్యాకేజీ డిసెంబర్ 22 నుండి డిసెంబర్ 27 వరకు కొనసాగుతుంది.

ఈ టూర్ ప్యాకేజీ ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నుంచి ప్రారంభం అవుతుంది. పర్యాటకులు డిసెంబర్ 22 రాత్రి 11:05 గంటలకు లక్నో నుంచి విమానంలో థాయిలాండ్ వెళ్తారు. టూర్ మొత్తం బ్రేక్ ఫాస్ట్,లంచ్, డిన్నర్,బస అన్నింటిని చూసుకుంటుంది. దీని కోసం మీరు ఎలాంటి ఛార్జీ చెల్లించనక్కర్లేదు. డిసెంబరు 27న రాత్రి 8:10 గంటలకు బ్యాంకాక్ నుంచి లక్నోకు తిరిగి వస్తారు. టూర్ ప్యాకేజీ కింద మొత్తం 35 సీట్లు ఉన్నాయి. ఒక్కరు మాత్రమే వెళ్లానుకుంటే రూ.74,200 చెల్లించాలి. ఇద్దరు వ్యక్తులతో వెళితే ఒక్కొక్కరికి రూ.63,500 ఉంటుంది. ముగ్గురు వ్యక్తులు ఉంటే ఒక్కో వ్యక్తికి రూ.62,900 చెల్లించాల్సి ఉంటుంది. ఇది కాకుండా 5 నుండి 11 సంవత్సరాల లోపు పిల్లలు ఉంటే ఒక్కరికి రూ.57,500.. 2 నుండి 11 సంవత్సరాల మధ్య పిల్లలు ఉంటే..బెడ్ అవసరం లే దు




# కొత్తగా పెళ్లి చేసుకునే వారు.. ఇవి అడగొద్దు



కొత్తగా పెళ్లి చేసుకునే వారు తమ భాగస్వామ్యులు గురించి చాలా తెలుసుకోవాలని తహతహలాడుతుంటారు. ఒకరి గురించి ఒకరు తెలుసుకోవాలని, ఒకరి అభిరుచులు మరొకరు తెలుసుకొనాలని అనుకుంటూ ఉంటారు. భాగస్వామి గతంలోని సంబంధాల గురించి తెలుసుకోవాలని అనుకుంటూ ఉంటారు. ఇలాంటి సున్నితమైన విషయాలను అడగడం కంటే అడగకుండా ఉండిపోవడమే మంచిది. ఒకవేళ అడగాలనుకుంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అసలు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? భాగస్వామిని ఎలాంటి ప్రశ్నలు అడగకూడదు ముందు తెలుసుకోవాలి.


అబ్బాయి అయినా, అమ్మాయి అయినా తమ భాగస్వామి పాత సంబంధాల గురించి అడిగేటప్పుడు, ఎందుకు అడుగుతున్నారా నిజాయతీగా చెప్పాలి. కాబోయే జీవిత భాగస్వామి మీరు అడుగుతున్న విధానాన్ని, ఎందుకు అడుగుతున్నారో అన్న విషయాన్ని తప్పుగా అర్థం చేసుకోకుండా ఇలా నిజాయతీగా చెప్పేయడం వల్ల ఎలాంటి సమస్యలు ఉండవు. ఈ విషయంపై మాట్లాడే ముందు వారి ఇష్టాయిష్టాలు తెలుసుకొని మాట్లాడాలి. అభ్యంతరం లేదు అన్నప్పుడే ఈ విషయం గురించి చర్చిస్తే మంచిది.

పాత సంబంధాలు గురించి అడగడం అనేది చాలా ? మా

గురించి అడిగేటప్పుడు సరైన సమయం, సరైన ప్రదేశం ఉండాలి. ప్రశాంతమైన వాతావరణంలో మీ భాగస్వామి ప్రశాంతంగా ఉన్నప్పుడే ఈ విషయం గురించి అడగండి. వారు గందరగోళంలో ఉన్నా, కోపంలో ఉన్నా ఇలాంటి విషయాల గురించి అడిగితే మీ బంధానికే ముప్పు వాటిల్లే అవకాశం ఉంటుంది. ఏ బంధంలోనైనా ఒకరిపై ఒకరికి నమ్మకం అనేది చాలా ముఖ్యం. అలాగే ఒకరినొకరు గౌరవించుకోవడం చాలా ముఖ్యం. అయితే గత రిలేషన్స్ గురించి చెప్పినా కూడా.. తమ భాగస్వామితో నమ్మకంగా ప్రేమగా జీవితాన్ని గడుపుతామనే నమ్మకాన్ని వారికి కలిగించాలి. మీరు వారిని గౌరవిస్తామనే ధైర్యాన్ని కల్పించాలి. గత బంధాల గురించి చెప్పిన వెంటనే వ్యతిరేకతను చూపకూడదు.



# చలికాలంలో చర్మ సమస్యలూ పరిష్కారం కావాలంటే?



చలికాలంతో పాటే చర్మ సమస్యలూ మొదలవుతాయి. శీతలగాలులకు ఒంట్లో తేమ తగ్గిపోయి.. దురద, చర్మం పగిలిపోవడం లాంటి ఇబ్బందులు ఎదురవుతాయి. వేడివేడి నీళ్లతో స్నానం చేయడం కూడా.. సమస్యను పెంచుతుంది. ముఖ్యంగా శీతకాలంలో పొడి చర్మం.. ప్రతిఒక్కరినీ ఇబ్బంది పెడుతుంది.చలికాలంలో చర్మ సంరక్షణకు అందరూ ఆశ్రయించేది.. మాయిశ్చరైజర్లు, క్రీమ్‌సే! అయితే, వీటి రక్షణంతా బయటి నుంచే! అదికూడా తాత్కాలికంగానే! పొడిచర్మం సమస్య పూర్తిగా పరిష్కారం కావాలంటే.. చర్మం లోపలి నుంచీ ఆరోగ్యంగా ఉండాలి. ఇందుకోసం ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు – చేర్పులూ చేసుకోవాలి.

చర్మం రోజంతా తేమగా ఉండాలంటే.. శరీరానికి తగినంత నీరు అందించాలి. అందుకే, దాహమైనా.. కాకున్నా రోజుకు కనీసం 8 గ్లాసుల మంచినీళ్లు తాగాలి.

చలికాలం తీసుకునే ఆహారంలో నెయ్యి, నువ్వుల నూనె ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవి చర్మాన్ని లోపలి నుంచి హైడ్రేటెడ్‌గా ఉంచుతాయి.

స్నానానికి ముందు గోరువెచ్చని నూనెతో శరీరాన్ని మర్దనా చేసుకోవడం వల్ల చర్మానికి కావాల్సిన పోషణ అందుతుంది. రక్త ప్రసరణ పెరిగి.. చర్మం తేమగా ఉంటుంది. ఇందుకోసం బాదం, నువ్వులు, కొబ్బరి నూనెలు ఎంచుకోవడం మంచిది. రెగ్యులర్‌గా ఉపయోగించే సబ్బులను పక్కన పెట్టండి. ఇవి చర్మంలోని సహజ నూనెలను తొలగిస్తాయి. దాంతో చర్మం పొడిబారుతుంది.


కలబంద, పసుపు, వేప లాంటి సహజ పదార్థాలున్న సబ్బులను వాడండి. ముఖ్యంగా సున్నిపిండితో స్నానం చేయడం అనేక ప్రయోజనాలను అందిస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. నాణ్యమైన నిద్ర చాలా అవసరం. అందుకే, రోజు కనీసం 8 గంటలు నిద్రపోండి.

శీతాకాలంలో మామూలు 'టీ'కి బదులుగా.. అల్లం, దాల్చిన చెక్క లాంటి సుగంధ ద్రవ్యాలతో చేసిన 'హెర్బల్ టీ'ని ఎక్కువగా తీసుకోవాలి. ఇవి శరీరంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంతో పాటు, బాడీకి కావాల్సిన వేడిని అందిస్తాయి.



## ఇన్వెస్టర్లకు నచ్చని ఆర్బీఐ డిసిషన్..

## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్లకు ఆర్బీఐ నిర్ణయం నచ్చలేదు. ఫలితంగా శుక్రవారం ఐదు సెషన్ల లాభాలకు బ్రేక్ పడింది. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన జరిగిన ద్రవ్య పరపతి సమీక్షలో కీలక వడ్డీరేటు 6.5 శాతం యధాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నది. కానీ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 7.2 నుంచి 6.5 శాతానికి కుదించేసింది. నెమ్మదించిన ఆర్థిక వృద్ధి రేటును పరుగులెత్తించేందుకు బ్యాంకులకు అవసరమైన నిధుల లభ్యత కోసం క్యాష్ రిజర్వ్ రేషియో (సీఆర్ఆర్)లో కోత విధించింది.

బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 56.74 పాయింట్లు (0.07 శాతం) నష్టపోయి 81,709.12 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 81.925.91 పాయింట్ల నుంచి 81,506.19 పాయింట్ల మధ్య తచ్చాడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ-50 30.60 పాయింట్ల పతనంతో 24,677.80 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 24,751.05 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లి, 24,620.50 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది.

ఎన్ఎస్ఈ-50లో 32 స్టాక్స్ నష్టాలతోనే ముగిశాయి. అదానీ పోర్ట్స్, సిప్లా, భారతీ ఎయిర్ టెల్, హెచ్డీఎఫ్సీ లైఫ్, ఇండస్ఇండ్ బ్యాంక్ స్టాక్స్ 1.51 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, బీపీసీఎల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ సహా 18 స్టాక్స్ 3.21 శాతం వరకూ లాభ పడ్డాయి. నిఫ్టీ మిడ్ క్యాప్-100 0.45 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 0.82 శాతం లాభాలతో ముగిశాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంకు, కన్జూమర్ డ్యూరబుల్స్, ఓఎంసీ, హెల్త్ కేర్, ఫైనాన్సియల్స్ లాభాలతో ముగిస్తే, మిగతా ఇండెక్సులు పతనం అయ్యాయి. జనవరి ఒకటో తేదీ నుంచి ధరలు పెంచుతున్నట్లు మారుతి సుజుకి, హ్యుండాయ్ మోటార్ ఇండియా ప్రకటించడంతో ఆటో స్టాక్స్ పుంజుకున్నాయి.

బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్-30లో టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి, ఎల్ అండ్ టీ, ఐటీసీ ప్రధానంగా లాభ పడ్డాయి. అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్ టెల్, ఏషియన్ పెయింట్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫిన్ సర్వ్ పతనం అయ్యాయి. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్ పై రూపాయి మారకం విలువ రూ.84.69 లకు చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ 71.62 డాలర్లు, ఔన్స్ బంగారం ధర 2660 డాలర్లు పలికాయి.

## వరుసగా 11వ సారి.. వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పూ లేదు



**న్యూఢిల్లీ:** వడ్డీ రేట్ల విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం కీలక ప్రకటన చేసింది. ఈసారి కూడా కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచుతున్నట్లు స్పష్టం చేసింది. వరుసగా 11వ సారి కూడా రెపో రేటును 6.5 శాతంగానే ఫిక్స్ చేసింది. ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు.

రెపో రేటును 6.5 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. ద్రవ్యోల్బణం, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ సారి కూడా వడ్డీరేట్లలో మార్పులు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. కాగా, 2023 ఫిబ్రవరి నుంచి రెపో రేటును ఇలాగే కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. రెపో రేటులో ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది 11వ సారి.

## ఈపీఎఫ్ఓలో కీలక నిబంధనల మార్పు..




**న్యూఢిల్లీ:** భారతదేశంలో ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వీరికి రిటైర్‌మెంట్ సమయంలో ఆర్థిక భరోసా కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ద్వారా సొమ్ము పొదుపు చేస్తుంది. ఉద్యోగితో పాటు యజమాని సమానా వాటాతో ఉండే ఈ పీఎఫ్ విత్‌డ్రాకు మాత్రం కొంత ఇబ్బంది ఉంటుంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే పీఎఫ్ విత్‌డ్రాకు అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈపీఎఫ్ఓ తన నిబంధనలు మార్చే అవకాశం ఉంది. ఆ నిబంధనల వివరాలను తెలుసుకుందాం.

ప్రస్తుత రోజుల్లో పీఎఫ్ విత్‌డ్రాకు ఆధార్ తప్పనిసరి. యూనివర్సల్ అకౌంట్ నంబర్‌ని ఆధార్‌తో తప్పనిసరిగా లింక్ చేయాల్సి ఉంది. అయితే ఇటీవల కొన్ని వర్గాల ఉద్యోగులకు ఈ నిబంధన నుంచి మినహాయింపునిచ్చారు. దీంతో ఆధార్ లేని ఉద్యోగులు ఈపీఎఫ్ఓ క్లెయిమ్‌లు చేయవచ్చు.

ప్రస్తుత రోజుల్లో పీఎఫ్ విత్‌డ్రాకు ఆధార్ తప్పనిసరి. యూనివర్సల్ అకౌంట్ నంబర్‌ని ఆధార్‌తో తప్పనిసరిగా లింక్ చేయాల్సి ఉంది. అయితే ఇటీవల కొన్ని వర్గాల ఉద్యోగులకు ఈ నిబంధన నుంచి మినహాయింపునిచ్చారు. దీంతో ఆధార్ లేని ఉద్యోగులు ఈపీఎఫ్ఓ క్లెయిమ్‌లు చేయవచ్చు.

ఆదార్ లేకుండా పీఎఫ్ విత్‌డ్రా చేయాలంటే పాస్‌పోర్ట్‌లు, పౌరసత్వ ధ్రువీకరణ పత్రాలు లేదా ఇతర అధికారిక గుర్తింపు కార్డుల వంటి ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలు అవుతుంది. అలాగే రూ. 5 లక్షలకు మించిన క్లెయిమ్‌లను ప్రాసెసర్ చేయాలంటే యజమాని ధ్రువీకరణ తప్పనసరి అవుతుంది.

ఆదార్ లేకుండా పీఎఫ్ విత్‌డ్రా చేయాలంటే పాస్‌పోర్ట్‌లు, పౌరసత్వ ధ్రువీకరణ పత్రాలు లేదా ఇతర అధికారిక గుర్తింపు కార్డుల వంటి ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలు అవుతుంది. అలాగే రూ. 5 లక్షలకు మించిన క్లెయిమ్‌లను ప్రాసెసర్ చేయాలంటే యజమాని ధ్రువీకరణ తప్పనసరి అవుతుంది.

భారత్‌లో పనిచేసి, ఆధార్‌ను పొందలేకపోయిన అంతర్జాతీయ ఉద్యోగులు తమ స్వదేశాలకు తిరిగి వస్తే వారి పీఎఫ్ విత్‌డ్రాకు ఆధార్ అవసరం లేదు. అలాగే విదేశీ పౌరసత్వం ఉన్న భారతీయ పౌరులు, నేపాల్, భూటాన్ పౌరులుశాశ్వతంగా విదేశాలకు వెళ్లిన భారతీయ పౌరులు పీఎఫ్ విత్‌డ్రాకు ఆధార్ అవసరం లేదని ఈపీఎఫ్ఓ ఇటీవల స్పష్టం చేసింది.

భారత్‌లో పనిచేసి, ఆధార్‌ను పొందలేకపోయిన అంతర్జాతీయ ఉద్యోగులు తమ స్వదేశాలకు తిరిగి వస్తే వారి పీఎఫ్ విత్‌డ్రాకు ఆధార్ అవసరం లేదు. అలాగే విదేశీ పౌరసత్వం ఉన్న భారతీయ పౌరులు, నేపాల్, భూటాన్ పౌరులుశాశ్వతంగా విదేశాలకు వెళ్లిన భారతీయ పౌరులు పీఎఫ్ విత్‌డ్రాకు ఆధార్ అవసరం లేదని ఈపీఎఫ్ఓ ఇటీవల స్పష్టం చేసింది.

# డే అండ్ నైట్ టెస్ట్..

# తొలి రోజు ఆస్ట్రేలియాదే

**6 వికెట్లతో చెలరేగిన స్టార్క్..**

**పింక్ బాల్ టెస్టులో భారత్ 180 ఆలౌట్..**

**నితీశ్ రెడ్డి టాప్ స్కోరర్**

**బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో.. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకు ఆలౌట్ అయింది. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (42) టాప్ స్కోరర్. ఓపెనర్ కేఎల్ రాహుల్ (37), శుభ్‌మన్ గిల్ 31 రన్స్ చేశారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, యశస్వీ జైస్వాల్ నిరాశపరిచారు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్ 6 వికెట్లతో చెలరేగాడు.**




**అడిలైడ్:** తొలి టెస్టులో అద్భుత విజయంతో అడిలైడ్‌లోకి అడుగుపెట్టిన భారత్.. ఇక్కడా తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. మరోసారి ఆసీస్ పేసర్లు చెలరేగగా.. భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 44.1 ఓవర్లలో 180 పరుగులు చేసింది. నితీశ్ రెడ్డి 42 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కేఎల్ రాహుల్ 37, శుభ్‌మన్ గిల్ 31 రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ 6 వికెట్లు పడగొట్టగా.. కమిన్స్, బోలండ్ తలో రెండు వికెట్లు తీశారు. కిందటి మ్యాచ్‌లో ఓపెనర్లు మంచి భాగస్వామ్యం నమోదు చేయగా.. ఈసారి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. పెర్త్ టెస్టులో సెంచరీ చేసి జోరు మీదున్న యశస్వీ జైస్వాల్‌ను (0) ఇన్నింగ్స్ తొలి బంతికే బోల్తా కొట్టించాడు మిచెల్ స్టార్క్ అతడి బౌలింగ్‌లో యశస్వీ.. ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేరాడు. తొలి మ్యాచ్‌లో బంతి నెమ్మదిగా వస్తుందని జైస్వాల్.. స్టార్క్‌ను ఆటపట్టించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అతడి బౌలింగ్‌లో అది కూడా తొలి బంతికే అవుట్ అయ్యాడు.

వన్‌డౌన్‌లో వచ్చిన శుభ్‌మన్ గిల్.. ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశాడు. మంచి కవర్ డ్రైవ్స్‌తో వరుస బౌండరీలు సాధించాడు. మరో ఎండ్‌లో తొలుత ఓపెనర్ రాహుల్.. పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డా.. గాయం కారణంగా తొలి మ్యాచ్ ఆడని గిల్ మాత్రం స్కోరు బోర్డును నడిపించాడు. కాసేపటికి రాహుల్ కూడా వరుస బౌండరీలతో లైన్‌లోకి వచ్చాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు 69 పరుగులు జోడించారు. అంతా బానే సాగుతుందనుకుంటున్న తరుణంలో తొలి సెషన్ కాసేపట్లో ముగుస్తుందనగా మరో స్పెల్ కోసం వచ్చిన స్టార్క్ భారత బ్యాటర్లను కకావికలం చేశాడు.

తొలుత కేఎల్ రాహుల్‌ను బౌన్సర్‌తో అవుట్ చేసిన స్టార్క్.. కాసేపటికే విరాట్ కోహ్లీని (7) కూడా పెవిలియన్ చేర్చాడు. గిల్ కూడా బోలండ్ బౌలింగ్‌లో లంచ్‌కు ముందే అవుటయ్యాడు. విరామం తర్వాత కెప్టెన్ రోహిత్ శర్మను (3) కూడా బోలండ్ అద్భుత బంతితో ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేర్చాడు. రిషభ్ పంత్ (21) రన్స్ చేశాడు. తర్వాత అశ్విన్ (22), నితీశ్ రెడ్డి కలిసి ఏడో వికెట్‌కు 32 పరుగులు జోడించారు.




ఓవైపు వికెట్లు పడుతున్నా కూడా.. నితీశ్ రెడ్డి టెయిలెండర్లతో కలిసి అడపాదడపా బౌండరీలు బాదడంతో భారత్.. ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. హర్షిత్ రాణా, బుమ్రా డకౌట్ అయ్యారు. సిరాజ్ 4 పరుగులు చేశాడు. అంతకుముందు తొలుత టాస్ గెలిచిన భారత్.. బ్యాటింగ్ ఎంచుకుంది. 2 మార్పులే ఉంటాయనుకుంటే.. అనూహ్యంగా మూడు మార్పులతో బరిలోకి దిగింది రోహిత్ సేన. పడిక్కల్, జురెల్ స్థానంలో రోహిత్, గిల్ రాగా.. వాషింగ్టన్ సుందర్ స్థానంలో రవిచంద్రన్ అశ్విన్ వచ్చాడు. ఆస్ట్రేలియాలో హేజిల్‌వుడ్ స్థానంలో.. బోలండ్ ఎలెవన్‌లోకి వచ్చాడు.

అడిలైడ్ స్టేడియంలో శుక్రవారం రెండు సార్లు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో కొన్ని క్షణాల పాటు మ్యాచ్‌ను నిలిపివేశారు. రేపు మధ్యాహ్నం ఆస్ట్రేలియా ఓ నాలుగు గంటల పాటు సహజమైన వెలుతురులో బ్యాటింగ్ చేయనున్నది. అయితే ఇవాళ ఆసీస్ బ్యాటర్లు బుమ్రా గండాన్ని తప్పించుకున్నారు. వెరైటీ బంతులతో బుమ్రా చెలరేగినా.. ఆసీస్ బ్యాటర్లు మాత్రం సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ఉదయం ఆసీస్ బౌలర్ మిచెల్ స్టార్క్ చాన్నాళ్ల తర్వాత రెచ్చిపోయాడు. ఇండియన్ బ్యాటర్లను తన స్వింగ్ యాక్షన్‌తో సతాయించాడు. ఆరు వికెట్లు తీసి కెరీర్ బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడు.

## యూత్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఎదురుదెబ్బ



**న్యూఢిల్లీ:** డాకర్(సెనెగల్) వేదికగా 2026లో జరిగే ప్రతిష్ఠాత్మక యూత్ ఒలింపిక్స్‌లో భారత పతక అవకాశాలకు ఘోరమైన ఎదురుదెబ్బ తగిలింది. భారత్ కచ్చితంగా పతకాలు సాధిస్తుందనుకున్న షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, హాకీ లాంటి క్రీడాంశాలను యూత్ ఒలింపిక్స్ నుంచి తీసేశారు.

ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) ఎగ్జిక్యూటివ్ బోర్డు గురువారం ఈ నిర్ణయం తీసుకుంది. 2018లో జరిగిన యూత్ గేమ్స్‌లో భారత్‌కు షూటింగ్‌లో నాలుగు, హాకీలో రెండు, వెయిట్‌లిఫ్టింగ్ ఒక పతకం వచ్చింది. రానున్న యూత్ ఒలింపిక్స్‌లో భారత పతకాలపై ప్రభావం పడనుంది.

## అవును.. డిసెంబర్ 22న నా పెళ్లి : స్టార్ షట్లర్

**హైదరాబాద్:** భారత బ్యాడ్మింటన్ స్టార్, డబుల్ ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు చెందిన 29 ఏళ్ల వెంకట దత్త సాయిని సింధు మనువాడనుంది. ఈ నేపథ్యంలో తన పెళ్లి గురించి స్టార్ షట్లర్ తొలిసారి స్పందించారు. ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న సింధును విలేకరులు పెళ్లి గురించి ప్రశ్నించారు. ఇందుకు ఆమె స్పందిస్తూ.. 'అవును, ఈనెల 22న నేను పెళ్లి చేసుకోబోతున్నాను' అంటూ సమాధానమిచ్చారు.

కాగా, సింధు పెళ్లి చేసుకునే వెంకట దత్త సాయి.. పోసిడెక్స్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయాన్ని ఆమె తండ్రి పీవీ రమణ రెండు రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. 'మా రెండు కుటుంబాలకు ఎప్పటి నుంచో పరిచయం ఉంది. కానీ నెల క్రితమే పెళ్లి ఖాయమైంది. జనవరి నుంచి సింధు వరుస టోర్నీలు ఆడబోతోంది. అందుకే సాధ్యమైనంత తొందరగా పెళ్లి చేయాలని భావించాం. డిసెంబర్ 22న పెళ్లి వేడుక జరిపించేయాలని ఇరు కుటుంబాలు నిర్ణయించుకుని ముహూర్తం పెట్టించాం. 24న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఉంటుంది. వచ్చే సీజన్ చాలా ముఖ్యమైనది కాబట్టి సింధు త్వరలోనే



ప్రాక్టీస్ కూడా మొదలుపెడుతుంది' అని ఆమె తండ్రి పీవీ రమణ తెలిపారు. వీరి వివాహం ఈనెల 22న ఉదయ్‌పూర్‌లో అంగరంగా వైభవంగా జరగనుంది. ఇక డిసెంబర్ 20న సింధు పెళ్లి వేడుకలు మొదలు కానున్నాయి.

# అదరగొట్టిన యువ భారత్..

**అండర్ 19 ఆసియా కప్ ఫైనల్ చేరే జట్లేవో తేలిపోయింది. ఈనెల 8న భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య ఫైనల్ జరగనుంది. శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్లో శ్రీలంకపై భారత్.. పాకిస్తాన్ పై బంగ్లాదేశ్ విజయం సాధించాయి. డిసెంబర్ 8న ఫైనల్లో బంగ్లాదేశ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది భారత్.**




**షార్జా:** ఆసియా కప్ అండర్ 19 ప్రపంచకప్ లో భారత జట్టు ఫైనల్ చేరింది. శుక్రవారం శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్ లో 7 వికెట్ల తేడాతో యువ భారత్ ఘనవిజయం సాధించింది. టోర్నీ ఆరంభ మ్యాచ్లో పాకిస్తాన్ చేతిలో ఓడిపోయిన భారత్ ఆ తర్వాత వరుసగా మూడు విజయాలు సాధించి ఫైనల్ చేరింది.

షార్జా వేదికగా జరిగిన ఈ మ్యాచ్లో టాస్ గెలిచిన శ్రీలంక జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో ఆ జట్టు బ్యాటర్లు పరుగులు చేయలేకపోయారు. కనీసం 50 ఓవర్లు బ్యాటింగ్ కూడా చేయలేకపోయారు. 46.2 ఓవర్లలో శ్రీలంక 173 పరుగులకు ఆలౌట్ అయింది. శ్రీలంక బ్యాటర్లలో లక్విన్ 69 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు.

భారత బౌలర్లలో చేతన్ శర్మ మూడు వికెట్లు తీశాడు. ఆయుష్ మాత్రే, కిరణ్ రెండేసి వికెట్ల చొప్పున తీశారు. యుదజిత్ గుహా, హార్దిక్ రాజ్ చెరో వికెట్ పడగొట్టారు.

అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ కు ఓపెనర్లు శుభారంభం అందించారు. తొలి వికెట్ కు 51 బంతుల్లో 91 పరుగులు జోడించారు. గత మ్యాచ్ లో హాఫ్ సెంచరీతో రాణించిన 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్ లోను సత్తా చాటాడు. టి20 తరహాలో రెచ్చిపోయాడు. 36 బంతుల్లో 67 పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లు కూడా రాణించడంతో భారత్ 21.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. దీంతో అండర్ 19 ఆసియా కప్ లో ఫైనల్ చేరింది. హాఫ్ సెంచరీతో సత్తా చాటిన వైభవ్ సూర్యవంశీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎంపికయ్యాడు.

మరో సెమీఫైనల్ లో బంగ్లాదేశ్ జట్టు.. పాకిస్తాన్ ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 116 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బంగ్లాదేశ్ 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య ఈనెల 8న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

# మెగాస్టార్, అనిల్ రావిపూడి సినిమాకు తమన్ సంగీతం?



మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా తీయనుండగా.. ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇద్దరి సినిమా కాంబినేషన్ లో రాబోయే మూవీకి తెలుగు టాప్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందించనున్నట్లు సమాచారం అందుతోంది.

ప్రస్తుతం టాలీవుడ్‌లో టాప్ మ్యూజిక్ డైరెక్టర్లలో ఒకరైన తమన్, మరోసారి మెగాస్టార్ కోసం మ్యాజిక్ అందించేందుకు సిద్ధమయ్యారు. ఆ మధ్య చిరంజీవి 'గాడ్‌ఫాదర్' కోసం తమన్ సంగీతం అందించారు. ఈ సినిమా మ్యూజిక్ అనుకున్నంత స్థాయిలో క్లిక్కవ్వలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. చిరు మళ్ళీ తమన్‌కే ఛాన్స్ ఇవ్వడం వెనుక కారణం అనిల్ రావిపూడి అని తెలుస్తోంది.

తమన్‌తో అనిల్ రావిపూడికి మంచి స్నేహం ఉంది, తన సినిమాలకు తమన్ సంగీతం పెద్ద ప్లస్ అవుతుందని అనిల్ నమ్మకం ఉన్నట్లు సమాచారం. అనిల్ రావిపూడి భగవంత్ కేసరి సినిమాకు థమన్ ఇచ్చిన మ్యూజిల్ ప్లస్ అయ్యింది. అనిల్ రావిపూడి సినిమా అంటే మాస్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఉంటాయి. తమన్ బాణీలు చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని మేకర్స్ భావిస్తున్నారు. మెగాస్టార్ కెరీర్ లో మంచి మ్యూజికల్ హిట్స్ ఉన్న నేపథ్యంలో ఈసారి తమన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు సమాచారం. చిరు మాస్ ఇమేజ్‌కు తగిన మాస్ బీట్స్, అలాగే మెలోడియస్ ట్యూన్‌స్‌ను అందించాలని చూస్తున్నాడు.

ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ ఇప్పటికే పూర్తి అయినట్లు తెలుస్తోంది. ఇక మెగాస్టార్ విశ్వంభర మూవీ షూటింగ్ లో బిజీగా ఉన్నారు. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెలతో సినిమా బిజీలో ఉన్నారు.



# పుష్ప 2 డైలాగ్స్ పై చిరు ఫ్యాన్స్ ఆగ్రహం?

పుష్ప 2 సినిమాతో కాంట్రవర్సీకీ కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది. ఇప్పటికే అల్లు, మెగా ఫ్యామిలీకి సాధారణ ఎలక్షన్ నుంచి పడటం లేదు. దీంతో పవన్ కల్యాణ్ అభిమానులు అల్లు అర్జున్ ని టార్గెట్ చేయడం మొదలు పెట్టారు.

ఈ క్రమంలో 'పుష్ప 2' పై కూడా నెగిటివిటీ ఏర్పడింది. కానీ 'పుష్ప' హైప్ అడ్వాంటేజ్ అవ్వడంతో దానికి అల్లు అర్జున్ ప్రమోషన్స్ కూడా హెల్ప్ అవ్వడంతో 'పుష్ప 2' కి భారీగా రెస్పాన్ వస్తోంది. కానీ పుష్ప 2 సినిమా డైలాగ్స్ మెగా కుటుంబాన్ని ఉద్దేశించి ఉన్నట్లు ప్రచారం జరుగుతుండటంతో మెగా ఫ్యాన్స్ ఒకింత కోపంతో ఉన్నారు. సినిమాలో ఉన్న కొన్ని డైలాగులు మెగా అభిమానులకు ఇంకా కోపం తెప్పిస్తున్నాయి. సినిమా స్టార్టింగ్లో అల్లు అర్జున్ ఓ డైలాగ్ పలుకుతాడు. 'నీకు, నీ బాస్ కి, వాడి కొడుక్కి కూడా నేనే బాస్' అనే డైలాగ్ చిరంజీవిని టార్గెట్ చేసినట్లు ఉంది అంటూ మెగా ఫ్యాన్స్ మండిపడుతున్నారు.

మరోచోట నువ్వు పావలా వాటా గాడివి కదా అనే డైలాగ్, సెకండాఫ్ లో హీరో అన్న కూతుర్ని ఏడిపిస్తున్నారు అని విలన్ గ్యాంగ్ కి చెందిన వ్యక్తికి గుండు కొట్టించి గాడిదపై ఊరేగించడం.. తర్వాత ఆ సీన్ గురించి వచ్చే డైలాగులు కూడా మెగా అభిమానులకు ఇబ్బందికరంగా మారాయి అని చెప్పాలి. వీలైతే ఈ డైలాగ్స్ ని డిలీట్ చేస్తే మంచిదని సోషల్ మీడియాలో చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు. రిలీజ్ తర్వాత కూడా కొన్ని సినిమాలకి సీన్లు కట్ చేసిన సందర్భాలు ఉన్నాయి.

# నభా నటేష్ అందాల ఆరబోత



నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నభా నటేష్. తెలుగులో పలు సినిమాల్లో నటించింది. నభా తర్వాత సినిమాల్లో అందాల ఆరబోత చేయడం ద్వారా గ్లామర్‌తో మెప్పించింది.

మొత్తానికి ఈ అమ్మడు టాలీవుడ్‌లో మంచి కమర్షియల్ హీరోయిన్‌గా నిలిచింది. ఈ అమ్మడు పూరి జగన్నాథ్ దర్శకత్వంలో చేసిన ఇస్మార్ట్ శంకర్ భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో మరింతగా పాపులారిటీ సొంతం చేసుకుంది. కానీ కరోనా వల్ల ఆ సినిమా హిట్‌ను నభా క్యాష్ చేసుకుని మరిన్ని ఆఫర్లు దక్కించుకోవడంలో విఫలం అయ్యింది.

ఇస్మార్ట్ శంకర్ తర్వాత పెద్దగా సినిమాల్లో కనిపించని నభా నటేష్ మళ్లీ బిజీ అయ్యింది. ప్రస్తుతం ఆమె చేతిలో పలు సినిమాలు ఉన్నాయి. ఈ ఏడాది డార్లింగ్ అనే వెబ్ కంటెంట్‌తో ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన నభా నటేష్ వచ్చే ఏడాదిలో రెండు మూడు సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ఈ అమ్మడు సినిమా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. రెగ్యులర్‌గా ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. మరోసారి తన అందమైన ఫోటోలను నభా షేర్ చేయడంతో వార్తల్లో నిలిచింది.

అందాల నభా నటేష్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రెడ్ డ్రెస్‌లో నభా కుర్రకారు మతి పోగొడుతోంది. ఎంతటి వారు అయినా మతి పోవాల్సిందే.

సోషల్ మీడియాలో మరోసారి ముద్దుగుమ్మ నభా నటేష్ అందాల ఆరబోత ఫోటోలు వైరల్ కావడం జరిగింది. ఇంతటి అందగత్తెకు ఆఫర్లు ఆశించిన స్థాయిలో రాకపోవడం విడ్డూరంగా ఉందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# బెనిఫిట్ షో రద్దుపై 'దిల్ రాజు' ఏం చేస్తడో?

పుష్ప 2 బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో మహిళ మృతి చెందగా.. బాలుడు ప్రాణపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కాగా బెనిఫిట్ షోలు, మిడ్ నైట్ షోలు, ఎర్లీ మార్నింగ్ షోలు అంటూ టాలీవుడ్ లో సందడి కనిపిస్తూ ఉంటుంది. హైదరాబాద్ లో ఆర్టీసీ క్రాస్ రోడ్స్, కూకట్‌పల్లి ఏరియాలలో ఎక్కువగా స్పెషల్ షోలు వేస్తుంటారు. కాగా మహిళ చనిపోవడం బాలుడు సీరియస్ ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం బెనిఫిట్ షోలను సీరియస్ గా తీసుకుంది. బెనిఫిట్ షోలను రద్దు చేస్తున్నట్లు తెలంగాణ సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు.

తాజాగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సంధ్య థియేటర్ ఘటనపై స్పందిస్తూ.. ఇక నుంచి రాష్ట్రంలో బెనిఫిట్ షోలకు పర్మిషన్ ఇవ్వమంటూ సంచలన ప్రకటన చేశారు. దీంతో త్వరలో విడుదల కాబోయే పెద్ద సినిమాల పరిస్థితి ఏంటనేది టాలీవుడ్ లో చర్చనీయాంశంగా మారింది. స్టార్ హీరోల సినిమాలు ఓపెనింగ్ డే రికార్డ్‌లు సృష్టించాలి అంటే ప్రీమియర్‌లు, బెనిఫిట్ షోలు, ఎర్లీ మార్నింగ్ షోలు ఉండాలి.

కానీ ఇకపై వాటికి నైజాంలో అనుమతులు ఇవ్వకపోతే నిర్మాతలకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.'పుష్ప 2: ది రూల్' తర్వాత ప్రేక్షకుల ముందుకు వచ్చే పెద్ద సినిమా "గేమ్ ఛేంజర్". రామ్ చరణ్ నటించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 10వ తేదీన విడుదల కానుంది. దీంతో పాటుగా బాలకృష్ణ నటించిన 'డాకు మహారాజ్', వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలు కూడా రెండేసి రోజుల గ్యాప్ లో థియేటర్లలోకి రాబోతున్నాయి. ఈ మూడు చిత్రాలతోనూ దిల్ రాజు సంబంధం కలిగి ఉన్నారు. సంక్రాంతికి కీలకమైన సినిమాలు ఉన్న సమయంలో ఇలా కావడంతో దిల్ రాజుతో సహా నిర్మాతలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నుంచి రాబోతున్న మైలురాయి 50వ సినిమా 'గేమ్ చేంజర్'. అందుకే దిల్ రాజు ప్రతిష్టాత్మకంగా తీసుకొని బడ్జెట్ కు ఏ మాత్రం వెనకాడకుండా నిర్మించారు. డైరెక్టర్ శంకర్ ఎంత చెబితే అంత ఖర్చు చేసారు. ఇప్పుడు పెట్టుబడులు వెనక్కి రాబట్టుకోవాలంటే, టికెట్ హైక్స్ తో పాటుగా స్పెషల్ షోలు కూడా అవసరం అవుతాయి. ప్రభుత్వ పెద్దలతో దిల్ రాజుకు మంచి సత్సంబంధాలు ఉన్నాయి. అందులోనూ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆయనకు చాలా క్లోజ్.

ఒకవేళ 'గేమ్ చేంజర్' బెనిఫిట్ షోలకు అనుమతి తెచ్చుకుంటే, ఇకపై రాబోయే అన్ని పెద్ద సినిమాలకు పర్మిషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదే గానీ జరిగితే సినిమాటోగ్రఫీ మంత్రి ప్రకటన, ప్రస్తుతానికి ప్రజలను కూల్ చెయ్యడానికి ఇచ్చిన స్టేట్మెంట్ అనుకోవాలి. థియేటర్ వద్ద అలాంటి దుర్ఘటనలు జరిగాయని ప్రతీ సినిమాకీ అలానే జరుగుతుందని అనుకోవడం సరికాదు. అందుకే పూర్తిగా బెనిఫిట్ షోలను బ్యాన్ చెయ్యకుండా, తగినన్ని జాగ్రత్తలు తీసుకునేలా ప్రభుత్వం అనుమతులు ఇస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.